తనదాకా వస్తే...?

సుధాకర్ బుర్ర ఆలోచనలతో చెదలపుట్టలా వుంది. నిద్రపట్టడం లేదు. అటూ ఇటూ దొర్లుతూ నిద్రపోవడానికి చేసిన ప్రయత్నం వృథా అయింది. విసుగ్గా లేచి కూర్చుని సిగరెట్ మీద సిగరెట్ తాగడం మొదలుపెట్టాడు.

మాలతి ఏమయినట్టు? వారం రోజులుగా ఎందుకు కన్పించడంలేదు? శనివారం పార్కుకు వస్తానని రాలేదు. తను ఎంతోసేపు ఎదురుచూశాడు. రోజూ ఒకసారయినా ఆఫీసుకు ఫోన్ చేసే మాలతి కనీసం ఫోన్‌కూడా చెయ్యడంలేదేమిటి? తాను ఎన్నోసార్లు ఫోన్ చేశాడు. ప్రతిసారీ పనికుర్రాడినుంచి ఒకే సమాధానం- "అమ్మగారు పడుకొని వున్నారు" అని. ఆరోగ్యం బాగాలేదా అంటే "నాకు తెల్దండి" అంటాడు. డాక్టరు వస్తున్నాడా అని అడిగితే 'లేదు' అన్నాడు.

మరి ఏమయింది మాలతికి? తండ్రి చండశాసనుడు. తమ ప్రేమ వ్యవహారం తెలిసి కట్టడిలో పెట్టాడా?

మాలతి స్వయంగానే మనసు మార్చుకుందా? అలా ఎన్నటికీ జరగదు. మాలతికి తనంటే ప్రాణం. తన రచనలంటే మహా గౌరవం. ముందు తనను రచయితగా ఆరాధించింది. పరిచయం పెంచుకుంది. ఆ పరిచయం ప్రేమగా మారింది.

మాలతి తండ్రి వివాహానికి ఒప్పుకోకపోతే? మాలతి తండ్రిని ఎదిరించి తనను వివాహం చేసుకుంటుందా? మాలతికి తండ్రిని ఎదిరించే ధైర్యం లేకపోతే? లేదు... లేదు... మాలతికి చాలా ధైర్యం. ఆధునిక భావాలుగల స్త్రీ. ఆధునిక యుగంలోని యువతరానికి ప్రతినిధిలాంటి మాలతి, తండ్రికి భయపడుతుందా? ఆమెకు భయం అంటే ఏమిటో తెలియదు. విప్లవ భావాలుగల రచనలు తను చేస్తాడనేగా మాలతికి తనంటే అంత అభిమానం, గౌరవం? మరి వారం రోజులుగా ఎందుకు కన్పించనట్లు?

సుధాకర్ బుర్ర వేడెక్కిపోయింది.

ఎవరో తలుపుకొడుతున్న శబ్దం విని ఉలిక్కిపడ్డాడు సుధాకర్. టేబుల్‌మీద వున్న టైంపీసుకేసి చూశాడు. తొమ్మిదిన్నర. ఇప్పుడు ఎవరొస్తారు? రామం కాని కాదు కదా? మరో కొత్త కవిత్వం వ్రాశాడేమో? కొత్తగా కవిత్వం వ్రాసేవాళ్ళకు ఇదో పిచ్చి. వ్రాయగానే ఎవరో ఒకరికి వినిపించాలి.

విసుగ్గా లేచి వెళ్ళి తలుపు తెరిచాడు సుధాకర్.

ఎదురుగా నిల్చుని వున్న వ్యక్తిని చూసి నివ్వెరపోయాడు ఓ క్షణం.

"మాలతీ, నువ్వా? ఇంత పొద్దుపోయి ఇలా వచ్చావేం?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సుధాకర్.

"ముందు నన్ను లోపలకు రానిస్తావా?" మాలతి కంఠం బరువుగా ఉంది.

"సారీ! రా లోపలకు." మృదువుగా పిల్చాడు.

మాలతి కుర్చీలో కూర్చుంటూనే రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

సుధాకర్ నివ్వెరపోయాడు. దగ్గిరగా వెళ్ళి భుజాలు పట్టుకుంటూ "ఏమయింది మాలతీ? ఎందుకేడుస్తున్నావు?" ఆరాటంగా అడిగాడు.

మాలతి దుఃఖం కట్టలు తెంచుకుంది. సుధాకర్ అయోమయంలో పడ్డాడు.

తను ఊహించింది నిజమే. మాలతి తండ్రి మాలతిని ఈ వారం రోజులనుంచి నిర్బంధించి వుంటాడు. ఇప్పుడు ఎలాగో తప్పించుకొని వచ్చింది.

"మాలీ... చెప్పు? ఏం జరిగింది? మీ నాన్నగారు మన వివాహానికి అంగీకరించలేదా? అంతమాత్రానికే ఇంతగా బాధపడాలా? ధైర్యం కలదానివి అనుకున్నాను." తలమీద గోముగా నిమురుతూ అన్నాడు సుధాకర్.

"సుధాకర్, నా జీవితం..." వెక్కిళ్ళమధ్య మాటలు చిక్కుకుపోయాయి.

"ఛ! నీ జీవితానికి ఏమొచ్చింది? మీ నాన్నగారు ఇంట్లోనుంచి వెళ్ళకొట్టారా? నేనుండగా నీ జీవితానికి ఏ ఆపదా రాదు."

"అలా అనుకొనే నీ దగ్గరకు వచ్చాను. నువ్వు కాదంటే ఏ నుయ్యో గొయ్యో..."

ఒక్కసారిగా సుధాకర్ మాలతిని రెండుచేతులతో బిగువుగా పట్టుకున్నాడు.

"ఛ! ఏం మాటలవి? మనం రిజిస్టర్ మారేజ్ చేసుకుందాం. కొంతకాలం పోయాక నాన్నగారే నిన్ను వెతుక్కుంటూ వస్తారు" అన్నాడు లాలిస్తున్నట్టు.

మాలతి కళ్ళు తుడుచుకొని సుధాకర్ ముఖంలోకి దీనంగా చూసింది.

"మరీ అంత ఇదైపోకు. అసలు జరిగిందేమిటో చెప్పు. మీ నాన్నగారు ఏమన్నారు?"

"నాన్నగారు ఏమీ అనలేదు. మన వివాహం గురించి ఇంకా ఆయనతో మాట్లాడలేదు. ఆయనకు ఎటువంటి అనుమానంలేదు."

"మరి ఐతే ఎందుకేడుస్తున్నావ్?"

"ఏం చెప్పను సుధా?"

మళ్ళీ ఏడుపు ప్రారంభించింది.

సుధాకర్‌కు విసుగనిపించింది. ఏమిటి, చెప్పకుండా ఏడుస్తుంది?

"ఆ రోజు పార్కుకు వస్తానని రాలేదేం?"

"ఆ రోజే... ఆ రాత్రి... నా జీవితానికి కాళరాత్రి..."

"మాలతీ, ప్లీజ్! అసలు ఏం జరిగిందో చెప్పు?"

"చచ్చిపోవాలనుకున్నాను. మళ్ళీ నీకు నా ముఖం చూపించకూడదనుకున్నాను. వారం రోజులుగా నాతో నేను పోరాడి అసలు విషయం నీకు చెప్పాలని నిర్ణయించుకున్నాను. అంతా విని నీ నిర్ణయాన్ని చెప్పు. నీ నిర్ణయంమీదే నా భవిష్యత్తు ఆధారపడి వుంది."

సుధాకర్ బుర్రలో ఆలోచనలు చిక్కుపడిపోతున్నాయి. చిక్కువిడదీయడానికి

ప్రయత్నించినకొద్దీ పీటముడులు పడిపోతున్నాయి.

"అసలు సంగతేమిటో చెప్పు!" విసుగ్గా అన్నాడు సుధాకర్.

మాలతి సుధాకర్ ముఖంలోకి చూసింది ఓ క్షణం.

"ఆ రోజు పార్కులో నిన్ను కలుసుకోవడానికి బయలుదేరాను. ఎంతకీ బస్ రాలేదు. నిల్చొని నిల్చొని కాళ్ళు పీక్కుపోతున్నాయి. సంధ్యచీకట్లు కమ్ముకుంటున్నాయి. కనీసం ఆటోకూడా దొరకలేదు. అంతలో ఒక టాక్సీ వచ్చి నా ముందు ఆగింది. ఎందుకో ఆ టాక్సీలో వున్నవాళ్ళు నా కోసమే ఆపి వుంటారనిపించింది. టాక్సీకేసి చూశాను. టాక్సీ దిగుతూ రమేశ్ కనిపించాడు." ఆగి సుధాకర్ ముఖంలోకి చూసింది మాలతి.

సుధాకర్ కనుబొమలు ముడుచుకున్నాయి.

"ఊ! తర్వాత?" అన్నాడు కొంచెం తీవ్రంగా.

"అతన్ని చూసి నేను ముఖం తిప్పుకున్నాను."

"వాడు ఒకప్పుడు నిన్ను లవ్ చేశాడనుకుంటాను?"

"ఒకప్పుడేమిటి? ఎప్పటికీ చేస్తున్నాననే అంటూ వుంటాడు. ఉత్తరాలు రాస్తూ వుంటాడు."

"ఏడ్చాడు..." సుధాకర్ కంఠంలో ఈర్ష్య స్పష్టంగా ధ్వనించింది.

"రమేశ్ నా దగ్గరగా వచ్చాడు. 'మాలతీ!' అని పిల్చాడు, నేను కోపంగా చూశాను."

"అతను ఆత్రుతతో గబగబా చెప్పాడు. 'మాలతీ! చాలా అన్యాయం జరిగింది. సుధాకర్‌కు యాక్సిడెంటు జరిగింది. అతని ఆటో ఒక బస్‌కు గుద్దుకుంది. సమయానికి నేను ఆ బస్‌లో వున్నాను. ఆస్పత్రిలో చేర్పించాను. పరిస్థితి విషమంగానే వుంది. మేము అక్కడికే వెళ్తున్నాము. నువ్వూ వస్తావా?' అన్నాడు.

"ముందు నేను ఏం విన్నానో నాకు అర్థం కాలేదు. అర్థం కాగానే నాకు కళ్ళు తిరిగాయి. తూలిపోతున్న నన్ను పట్టుకొని రమేశ్ టాక్సీ దగ్గరకు నడిపించుకొని వెళ్ళాడు. టాక్సీ ఎక్కించాడు."

"స్కౌండ్రల్!" గుప్పిళ్ళు బిగబట్టాడు సుధాకర్.

మాలతి తలవంచుకొని కూర్చుంది మూర్తీభవించిన విషాదంలాగ.

"ఆc! ఆ తర్వాత?"

"టాక్సీలో వెనక సీట్లో తన పక్కనే నన్ను కూర్చోబెట్టుకున్నాడు. ఏదేదో అంటూ ఓదారుస్తున్నాడు. కాని నా బుర్ర మొద్దుబారి వుంది. అతని మాటలు వినే స్థితిలో లేను. కాని ఎంతసేపటికి ఆసుపత్రి రాదు. అద్దంలోనుంచి బయటకు చూశాను. కారు ఊరుబయట నిర్మానుష్యమైన రోడ్డు మీద స్పీడ్‌గా పోతూవుంది. ఊరు దాటి చాలా దూరం వచ్చామని తెలుసుకున్నాను. వెంటనే నాకు ఏదో స్ఫురించింది. అబద్ధంచెప్పి నన్ను మోసం చేసినట్లు అర్థం చేసుకున్నాను."

అంతవరకూ చెప్పి సుధాకర్ ముఖంలోకి చూసింది మాలతి.

సుధాకర్ సిగరెట్ పొగ గట్టిగా పీల్చి వదిలాడు.

"ఎక్కడికి తీసుకెళ్తున్నారు? ఆపండి టాక్సీ అని అరిచాను."

"ఆపారా?" ఆత్రంగా అడిగాడు సుధాకర్.

"లేదు. రమేశ్ నా చేతిని తన చేతిలోకి తీసుకొని నొక్కాడు."

"స్కౌండ్రల్!"

"నేను చెయ్యిలాక్కోవడానికి ప్రయత్నిస్తుండగానే రమేశ్ తన రెండో చేతిని నా నడుం చుట్టూ వేసి దగ్గరగా లాక్కున్నాడు."

సుధాకర్ చేతిలో సిగరెట్ ఒళ్ళోపడింది. చివుక్కున లేచి నిల్చున్నాడు.

"నువ్వెలా ఊరుకున్నావ్, ఆ రాస్కెల్ పళ్ళు రాలగొట్టకుండా?"

"నేను పెనుగులాడాను. కాని వదిలించుకోలేకపోయాను."

"మరి గట్టిగా అరవలేదూ?"

"అరిచినా వినడానికి అక్కడెవరుంటారు?"

"తర్వాత ఏం జరిగింది? ఆ గాడిదను లాగి చెంపమీద కొట్టావా?"

"అబ్బే లేదు. నన్ను గట్టిగా పట్టుకొని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే నేనేం చెయ్యగలను? రమేశ్ ఎంత భారీ మనిషో నీకు తెలియదూ?"

సుధాకర్ ఊపిరి బిగబట్టాడు ఓ క్షణం. సిగరెట్ తీసి పెట్టెమీద అశాంతిగా కొడుతున్నాడు. అతని గవదల ఎముకలు పైకి తేలాయి.

"సంతోషించాలే. వాడి శరీరపు ఒంపుల్ని మరోసారి వర్ణించవచ్చు. ఇప్పుడు అసలు సంగతి చెప్పు."

"ఎందుకంత కోపం? అటువంటప్పుడు నేనేం చెయ్యగలను?"

"టాక్సీలోనుంచి దూకెయ్యాల్సింది."

మాలతి ఆశ్చర్యంగా సుధాకర్ ముఖంలోకి చూసింది.

"అతను నన్ను అంత గట్టిగా..."

"ఛీ-సిగ్గులేదూ?"

"నన్నంటావేం? నేను కాదు గట్టిగా..."

"సరేలే, ఆ తర్వాత చెప్పు!"

అశాంతిగా గదిలో పచార్లు చేస్తున్నాడు సుధాకర్. వాడు తప్పక ఏదో చేసే వుంటాడు!

"టాక్సీ పొలాల మధ్యలో వున్న ఒక తోటలో, చిన్న కుటీరంలాంటి యింటి ముందు ఆగింది."

"ఆ తోట ఆ రాస్కెల్‌గాడిదే! వాడి రక్తం కళ్ళజూస్తాను!" పళ్ళు పటపట కొరికాడు సుధాకర్.

మాలతి మౌనంగా బల్బ్‌పైగా గోడమీద పురుగుల్ని వేటాడుతున్న బల్లిని చూస్తూ కూర్చుంది. అది-ఆ బల్లి-ఆ పురుగును పట్టుకోవడానికి ఎన్ని వేషాలు వేస్తుందో? తోక పురుగువైపుకు పెట్టి. నడుం విరిచి దొంగలా చూస్తోంది అవకాశంకోసం.

"ఆ బల్లి చూడు, పురుగును పట్టుకోవడానికి ఎన్ని దొంగవేషాలు వేస్తుందో?"

సుధాకర్ మాలతి ముఖంలోకి విస్మయంగా చూశాడు.

"పాపం! చూడు, ఆ పురుగు తలకిందుగా ఎలా పాకుతూ ఆ బల్లి దగ్గరకే పోతుందో! పురుగులు తలకిందుగా ఎలా పాకగలుగుతాయో! మనుషులుకూడా తలకిందపెట్టి నడవగలిగితే...?"

సుధాకర్ అయోమయంగా చూశాడు.

మాలతికి మతి చలించలేదు గదా? ఇటువంటి సమయంలోనా బల్లీ- పురుగూ గురించి మాట్లాడటం! మాలతి ముఖంలోకి భయం భయంగా చూశాడు.

మాలతి ముఖంలో పిచ్చిపట్టిన ఛాయలు ఏమీ కన్పించలేదు.

"బల్లీ-పురుగూ కథ తర్వాత. ముందు నీ కథ చెప్పు. టాక్సీ ఆగింది. ఆ తర్వాత ఏం జరిగింది?" విసుగ్గా ప్రశ్నించాడు సుధాకర్.

"ఏం జరిగి వుంటుందనుకుంటున్నావ్?" ఎదురుప్రశ్న వేసింది మాలతి.

మాలతికి నిజంగా మతి చలించినట్టుంది! లేకపోతే ఏమిటా ప్రశ్నలు?

"రమేశ్‌ను ఒక్కతోపు తోసేసి పారిపోయి వచ్చివుంటావు."

మునిగిపోతున్నవాడు గడ్డిపరక ఆసరాకోసం వెతుక్కుంటున్నట్టు అన్నాడు సుధాకర్.

మాలతి సుధాకర్ ముఖంలోకి నిరసనగా చూసింది.

"ఏమిటలా చూస్తావ్?" వళ్ళు మండిన సుధాకర్ అన్నాడు.

సుధాకర్ కణతలు పట్టుకొని కూర్చున్నాడు. అనేక అనుమానాలు మనసును కుదిపేస్తున్నాయ్. రక్తనాళాలు చిట్లటానికి సిద్ధంగా వున్నట్టు బాధపడసాగాడు.

"అరే! ఆ పురుగును చూడు సుధాకర్! తలక్రిందులుగా పాకుతూ కిందపడి పోయింది. చచ్చిపోయిందా? లేదు కదులుతూవుంది. అరె! మళ్ళీ పైకే పాకుతోంది. మళ్ళీ బల్లి వైపుకే పోతూంది."

"సందేహం లేదు. మాలతికి మతిపోయింది. జరగరానిదే ఏదో జరిగింది" అనుకుంటూ భయం భయంగా మాలతి ముఖంలోకి చూశాడు.

"టాక్సీ ఆగింది. రమేశ్ నన్ను దిగమన్నాడు. నేను దిగనన్నాను. అంతే! అమాంతం ఇంగ్లీషు సినీమాల్లో హీరోలా నన్ను ఎత్తి భుజంమీద వేసుకొని లోపలకు తీసుకెళ్ళాడు."

సుధాకర్ ఎవరో గొంతు పిసుకుతున్నట్టు ఉక్కిరిబిక్కిరై పోయాడు.

"రాస్కెల్! ఆ తర్వాత నిన్ను బలవంతం చేయబోయాడా? ఆ దగ్గిర్లో వున్న దేంతోనో గట్టిగా తలమీద బాది పారిపోయి వచ్చావా?"

మాలతి మాట్లాడలేదు. సుధాకర్ ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

"అంతే చేశావ్ గదూ? ఆ టాక్సీడ్రైవరుగాడికి కూడా బుద్ధి చెప్పావా?" బావిలోకి జారిపోతూ జారుదు మెట్లు పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నవాడిలా అడిగాడు సుధాకర్.

మాలతి విరక్తిగా నవ్వింది.

మాలతికి ఇటువంటప్పుడు నవ్వు ఎలా వస్తుందో? బహుశా ఏం జరిగి ఉండదు. తప్పించుకొని వచ్చి ఉంటుంది. అందుకే నవ్వగలుగుతోంది. సుధాకర్ గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

"చెప్పు మాలతీ! వెధవలిద్దరికీ బుద్ధిచెప్పి వచ్చేశావు గదూ?"

సుధాకర్‌కి జారుడుమెట్టు చేతికి తగిలినట్టు వుంది.

"ఇదేం సినిమా అనుకుంటున్నావా? జయలలితలాగో లేక జయాబాధురిలాగో 'డిష్యూం! డిష్యూం!' చేసి చుట్టూచేరిన మగవాళ్ళకు తలొకటీ తగిలించి పారిపోయి రావడానికి?"

చేతికందిన జారుడుమెట్టు మళ్ళీ జారిపోయింది. సుధాకర్ పడిపోతున్నాడు- క్రిందకు లోతు తెలియని అగాధంలోకి.

మళ్ళీ ఆధారంకోసం తడుముకుంటున్నాడు.

"సమయానికి ఎవరైనా వచ్చి రక్షించారా?"

మాలతి సుధాకర్ ముఖంలోకి చిత్రంగా చూసింది.

"ఇదేం నువ్వు రాసే కథ అనుకున్నావా? లేక తెలుగు సినిమా అనుకున్నావా-సరిగ్గా సమయానికి తలుపులు బద్దలు కొట్టుకొని హీరో ప్రవేశించి, హీరోయిన్‌ను రక్షించడానికి?" మాలతి కంఠం తీవ్రంగా ఉంది.

సుధాకర్ స్థాణువులా కూర్చున్నాడు.

"అయినా నువ్వేగా నా హీరోవి? మరి నువ్వు ఇక్కడే, ఈ గదిలో, ఆ సమయంలో, హాయిగా నిద్రపోతూ వుండివుంటావు. మరి అక్కడికొచ్చి రక్షించే వాళ్ళెవరున్నారు?" మళ్ళీ మాలతి అన్నది వ్యంగ్యంగా.

"సరేలే! పిచ్చిమాటలు మాట్లాడక ఇంతకూ జరిగిందేమిటో చెప్పు."

టైంబాంబ్‌ముందు కూర్చున్నవాడిలా ప్రాణాలు చిక్కబట్టుకొని కూర్చున్నాడు సుధాకర్.

మాలతి సుధాకర్‌కేసి నిర్లక్ష్యంగా చూసింది.

గోడమీద బల్లికేసి చూసింది. బల్లి సౌందర్యానికి ముగ్ధురాలైనట్లు, పురుగు బల్లివైపుకే పాకుతోంది.

రాజబాబు రమాప్రభ మీదకు గెంతినట్టు, ఒక్కసారిగా బల్లి పురుగుమీదకు గెంతింది.

క్షణంలో పురుగు బల్లి నోట్లోనుంచి సగం మాత్రమే కన్పించింది. మరుక్షణంలో ఆ సగంకూడా కన్పించకుండా పోయింది.

"మింగేసింది, చూడు!" అంది మాలతి.

సుధాకర్‌కు మాలతిని ఆ చెంపా ఈ చంపా వాయించాలనిపించింది. ఉద్రేకంతో ఊగిపోతున్నాడు.

"చివరకు ఆ బల్లీ పురుగూ కథే అయింది. బలవంతుడూ-బలహీనుడి కథే అయింది" అన్నది మాలతి, సుధాకర్ ముఖంలో దేన్నో వెతకడానికి ప్రయత్నిస్తున్నట్టు దీక్షగా చూస్తూ.

"అంటే... అంటే- వాడు నిన్ను..."

"అవును. అతను నన్ను రేప్‌చేశాడు." కసిగా అన్నది మాలతి.

సుధాకర్ చివుక్కున లేచి నిల్చున్నాడు. గదిలో ఊపుగా పచార్లు చేస్తున్నాడు. మధ్య మధ్య ఆగి మాలతికేసి పిచ్చివాడిలా చూడసాగాడు.

మాలతి ఆత్రుతతో సుధాకర్‌కేసి చూస్తూ కూర్చుంది.

సుధాకర్ ఎలాంటి నిర్ణయానికి వస్తాడు? తన భవిష్యత్తు అతని నిర్ణయం మీదే ఆధారపడి వుంది. సుధాకర్ విప్లవభావాలుగల రచయిత. అతని రచనలు భావవిప్లవానికి దోహదం చేసేవిగా వుంటాయి. అతనిలో నిజాయితీ వుంది. తను నమ్మినదాన్నే రాస్తాడు సుధాకర్. సుధాకర్ తప్పక తనను వివాహం చేసుకుంటాననంటాడు.

"ఇంత జరిగాక ఏ ముఖం పెట్టుకుని నా దగ్గరకి వచ్చావ్?"

మాలతి తెల్లబోయి చూసింది.

"నీ దగ్గిరకు రాక మరెక్కడికెళ్తాను సుధాకర్? ప్లీజ్, అట్లా మాట్లాడకు."

"కుళ్ళిపోయిన పండును తినే మూర్ఖుణ్ణి అనుకున్నావా?" కోపంగా అరిచాడు సుధాకర్.

మాలతి తీవ్రంగా సుధాకర్ కళ్ళలోకి చూసింది కోపంతో, అసహ్యంతో. నిలువెల్లా వణికిపోయింది. తను ఆలోచించిందేమిటి? జరిగిందేమిటి? సుధాకర్ రచనలూ, ఉపన్యాసాలూ అన్నీ ఇతరులకోసమేనా?

"సుధాకర్! నువ్వు రచయితవి. భావవిప్లవం రావాలనే రచయితవు. నేను మనిషిని. మనిషి కుళ్ళిపోవడం ఏమిటి, పళ్ళు కుళ్ళిపోతాయిగాని? నువ్వు కాదంటే నేనెక్కడికెళ్ళను?"

"ఛ! ఛ! నీకు బొత్తిగా మానం, అభిమానం లేవు. మరో ఆడదైతే ఇంత జరిగాక ఏ హుస్సేన్ సాగర్‌లోనో పడుతుంది." అసహ్యించుకుంటూ అన్నాడు సుధాకర్.

"సుధాకర్! ఒకసారి జ్ఞాపకం చేసుకో. పోయిన వారం సభలో నువ్వేం మాటా డావో? నీ కథకు ప్రథమ బహుమతి వచ్చినందుకు సన్మానం జరిగింది. నీ కథలో ఇతివృత్తం ఏమిటి? ఒక అమ్మాయిని ఒక దుర్మార్గుడు రేప్ చేస్తాడు, ఆ అమ్మాయి ఆత్మహత్యకు సిద్ధపడుతూ వుంటే ఒక యువకుడు ఆదుకొని పెళ్ళి చేసుకుంటాడు. ఆ రోజు ఎంత ఉద్రేకంగా ఉపన్యాసం ఇచ్చావు? మన దేశంలో అలాంటి యువకులు కావాలన్నావ్!"

సుధాకర్ జవాబివ్వలేదు.

"ఆ రోజు నీ ఉపన్యాసం వింటూ నేను ఎంత గర్వించానో? నా స్నేహితురాలు రమ "కబుర్లు చెప్పడం-కథలు రాయడం వేరు. ఇంత ఉద్రేకంగా మాట్లాడుతున్న ఈ రచయిత ఒక దగా పడిన పిల్లని పెళ్ళి చేసుకోగలడా?" అని అన్నప్పుడు నేను ఆమెతో వాదించాను. ఆ తెల్లవారి మనం పార్కులో కలుసుకున్నప్పటి మన సంభాషణ ఒకసారి జ్ఞాపకం చేసుకో."

✿ ✿ ✿

"కథలు చదివి మనుషులు మార్తారా?" అని అడిగాను.

"ఎందుకు మారరూ? కథలు చదివి మనిషి ఆలోచిస్తాడు. ఆలోచనలే మనుషుల్ని మారుస్తాయి. మారిన మనుషులే సమాజాన్ని మారుస్తారు" అన్నావు.

"కావచ్చు. కాని ఒక సందేహం!"

"ఏమిటది?"

"వ్రాసేవాళ్ళందరూ తాము నమ్మిన అభిప్రాయాలనే నిజాయితీతో రాస్తున్నా రంటావా? అవసరం అయితే ఈ రచయితలు వారి పాత్రలలాగే ప్రవర్తించగలరంటావా?" అని అడిగాను.

"ఒకరి సంగతి నాకు తెలియదు. నేను మాత్రం నేను నమ్మిన సిద్ధాంతాలనే రాస్తాను" అన్నావు నువ్వు.

"అంటే, నువ్వు దుండగుల పాలిటపడి గర్భవతి అయిన అమ్మాయిని మనస్ఫూర్తిగా స్వీకరించగలవా?" అని సంతోషంగా అడిగాను.

"తప్పకుండా!" ఉద్రేకంగా అన్నావు. నా కళ్ళు ఆనందంతో వెలిగిపోయాయి.

"ఆనాడు నువ్వు అన్న మాటలు గుర్తు తెచ్చుకో. నువ్వు ప్రేమించిన అమ్మాయిని

ఆమె చెయ్యని పాపానికి శిక్షిస్తావా? నీ మాలతి... నువ్వు ప్రాణప్రదంగా ప్రేమించిన మాలతి దగా పడింది."

"నేను రచయితను. నేను రాసేవన్నీ ఆచరణలో పెట్టి చూపించాలని ఎక్కడుంది? నీ ఉపన్యాసం వినే స్థితిలో నేనిప్పుడు లేను. ఇక వెళ్ళు. మళ్ళీ నాకు కన్పించకు" అన్నాడు సుధాకర్.

"సుధాకర్! ప్లీజ్, అట్లా మాట్లాడకు. నీ పాదాల్లో... కనీసం నీ దాసిగా... ఇంత చోటు..." కాళ్ళు పట్టుకోబోయింది మాలతి.

సుధాకర్ నిప్పులు తొక్కినవాడిలా ఒక్కసారిగా వెనక్కువెళ్ళాడు.

"నన్ను ముట్టుకోకు. నీకు ఆ అర్హత లేదు. ముందు ఇక్కడ్నుంచి వెళ్ళు. నాకు పిచ్చెక్కిపోతూంది. నేనేం చేస్తానో నాకే తెలియదు." గట్టిగా అరిచాడు సుధాకర్.

"శభాష్! బలే బాగా యాక్ట్ చేశావ్ మాలతీ! ఇక చాల్లే, పద!" అన్నది రమ లోపలకు వచ్చి.

మాలతి ముఖంలో ఏవగింపు, కళ్ళల్లో తిరస్కారం కొట్టొచ్చినట్టు కన్పించాయి.

"మాలతీ! ఏమిటి ఇదంతా, తమాషాగా ఆడిన నాటకమా? చంపేశావ్ పో!" రిలీఫ్‌గా అన్నాడు సుధాకర్.

"అవును, నీ అసలు రూపాన్ని తెలుసుకోవడానికి ఆడిన నాటకం. వస్తాను, గుడ్‌బై!"

"మాలతీ, ప్లీజ్..." ప్రాధేయపడుతున్నట్టు దగ్గరగావచ్చి నిల్చున్నాడు.

"ఏమిటి ప్లీజ్? నా పాదాల్లో ఇంత చోటు కావాలా? నీకు ఆ అర్హత లేదు. వస్తాను. రా రమా!"

విసురుగా మాలతి బైటికి వెళ్ళిపోయింది. మాలతిని అనుసరించింది రమ.

సుధాకర్ వాళ్ళు వెళ్ళినవైపే చూస్తూ స్థాణువులా నిలబడిపోయాడు!

(1969 తరుణ మాసపత్రిక)